హెల్త్ కార్డులపై అపోహలు వద్దు





ఆడిటోరియం పునరుద్ధరణపై చర్యలు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com


## ఎల్లారెడ్డి వాసికి డాక్టరేట్ పట్టా



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండి మాసానిపేటకు చెందిన వసుంధర డాక్టరేట్ పట్టా సాధించారు. విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుంచి పోషకాహార శాస్త్రంలో పీహెచ్‌డీ చేసి పట్టా పొందారు. 29వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ డిగ్రీని అందజేశారు. వసుంధర "ఫ్యాకల్టీ ఆఫ్ న్యూట్రిషన్"లో పరిశోధన పూర్తి చేసింది. తండ్రి ప్రభాకర్ స్వరూప చేయూతతో పదో తరగతి వరకు జీవదాన్ పాఠశాలలో చదువుకుంది. అన్న శ్రీకాంత్ ప్రోత్సాహంతో ఇంటర్ డిగ్రీ హైదరాబాద్‌లో చదివింది. భర్త నరేష్ సహకారంతో న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసింది.



# ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

■ నిజామాబాద్‌లో జెండా ఆవిష్కరించిన సుదర్శన్‌రెడ్డి
■ కామారెడ్డిలో పాల్గొన్న వి.హనుమంత్‌రావు ■ ప్రజా సంక్షేమమే ధ్యేయమని ప్రకటన



నిజామాబాద్‌లో జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



కామారెడ్డిలో జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**ఉమ్మడి జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొనగా.. కామారెడ్డిలో వీ హనుమంత్‌రావు హాజరు అయ్యారు. వారు అమరులకు నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.**



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన అవతర దినోత్సవానికి ముఖ్య అతిథిగా సుదర్శన్ రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. అమరవీరుల త్యాగాల పునాదులపై, పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల స్ఫూర్తితో తెలంగాణ ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని సూచించారు.

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

**అక్షరటుడే, ఇందూరు:** వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆహుతులను అలరింపజేశాయి. సిద్ధార్థ కళాక్షేత్ర బాలికలు బతుకమ్మ గేయంపై నృత్యం ప్రదర్శించగా, బాలభవన్ చిన్నారులు పచ్చదనం ప్రాముఖ్యతను చాటుతూ పచ్చని చెట్టునురా నేను అనే గేయంపై ప్రదర్శన ఇచ్చారు. అదేవిధంగా బాలభవన్ బాలబాలికలు కర్రసాము ప్రదర్శన ద్వారా ఆత్మరక్షణ విద్యను ప్రదర్శించారు. ఉత్తమ శకటాలుగా ఎంపికైన గృహ నిర్మాణ, ఆర్టీసీ సంస్థలకు బహుమతులు దక్కాయి. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగ రావు, డీఎఫ్‌వో సిద్ధార్థ్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్‌వో గీత పాల్గొన్నారు.

### అమరుల కుటుంబాలకు సన్మానం

తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. వ్యవసాయ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథితో కలిసి కలెక్టర్ ఇతర అధికారులు స్టాళ్లను సందర్శించారు.

### ఉచిత విద్యుత్

గృహ జ్యోతి కింద కామారెడ్డి జిల్లాలో 1,73,803 మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం రూ.137.81 కోట్లు, వ్యవసాయానికి 1,17,667 పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వీహెచ్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కింద 11,616 మంజూరు చేయగా.. 10,848 ప్రారంభం అయ్యాయని పేర్కొన్నారు. రూ.226.14 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు.

### అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాలుగా జిల్లాలో పాలన సాగుతోందని బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హన్మంత్ రావు అన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వీహెచ్ మొదట అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన 99 రోజుల్లోనే జిల్లాలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కింద 10 రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. జిల్లాలో 9,448 ప్రభుత్వ భవనాలకు శంకుస్థాపనలు చేయగా 5,386 భవనాలకు పైకప్పుల నిర్మాణం పూర్తయిందని, 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాల ద్వారా 4,170 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు.



నిజామాబాద్ అవార్డులు అందిస్తున్న సుదర్శన్ రెడ్డి







### విద్యా, వైద్య రంగాలకు..

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద కామారెడ్డి జిల్లాలో 18,455 మందికి రూ.49 కోట్లతో వైద్యం అందించామని హనుమంతరావు వివరించారు. మధ్యాహ్న భోజన పథకానికి రూ.27.82 కోట్లు ఖర్చు చేశామని, పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి రూ.10 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని 5,513 మందికి రూ.3.73 కోట్ల ఉపకార వేతనాలు, 3,419 మందికి 1.60 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశామని పేర్కొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. దోమకొండకు చెందిన ఇద్దరు విద్యార్థులు చేసిన విలువిద్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విలువిద్య ప్రదర్శనకు ముగ్ధులైన ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు విద్యార్థులకు రూ.50 వేలు నగదు పురస్కారం ప్రకటించారు. రెండవ విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఇటీవల చిరుతపులి దాడిలో పశువులను కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### రైతులకు..

యాసంగి సీజన్‌లో 4.01 లక్షల టన్నుల ధాన్యం సేకరించి ఇప్పటివరకు రూ.839.48 కోట్లు రైతులకు చెల్లించామని వీహెచ్ పేర్కొన్నారు. రైతు బీమా కింద 627 మంది నామినీలకు రూ.31.35 కోట్లు, రైతు భరోసా కింద 3,09,281 మందికి రూ.220.30 కోట్లు అందించామని పేర్కొన్నారు. మహిళా సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకారంతో కామారెడ్డిని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతామని హన్మంత్ రావు స్పష్టం చేశారు.

## గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 4, 6, 8, 10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం గ్రామ, వార్డు సభల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సీపీ సాయి చైతన్య, అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్నారు. సభలను విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు సహకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం విజయవంతం చేయాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. గ్రామ, వార్డు సభలలో ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేలా కృషి చేయాలన్నారు. సభల నిర్వహణకు నిర్ణీత షెడ్యూల్ తయారు చేసి, తదనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలను నోడల్ అధికారులుగా నియమించాని పేర్కొన్నారు. నిర్దేశిత తేదీలలో ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా సభలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై చర్చించాలన్నారు. సభల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్షపు నీరు నిల్వ చేయడం తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీఆర్‌వో బి.గీత, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, బోధన్ ఆర్డీవో విజయలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఏవో వీరస్వామి, సీపీవో రతన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేస్తున్న రాహుల్, రేవంత్



**అక్షరటుడే, కామారెడ్డి:** అగ్ర కులాలకు చెందిన వారైనా కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలు బీసీలకు న్యాయం చేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హన్మంత్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంత్ రావు మాట్లాడుతూ.. దేశానికి మూడు సార్లు నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని, ఆయన బీసీ అయి కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. అగ్ర కులానికి చెందిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బీసీల గురించి ఆలోచిస్తున్నారని వీహెచ్ తెలిపారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ 4500 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీల కన్నా బీసీలు ఎక్కువగా ఉన్నారని, బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని గమనించారని చెప్పారు. అందుకే బీసీల లెక్క తేల్చాలని నిర్ణయించారని, దేశవ్యాప్తంగా కులగణన జరగాలని పట్టుబట్టారని వివరించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం జరగాలని కోరడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణన చేపట్టడానికి నిర్ణయించిందని హన్మంత్ రావు పేర్కొన్నారు. అయితే జనగణనలో కులగణన వద్దని మెలిక పెట్టిందని ఆరోపించారు. కులగణన చేపడితే బీసీల లెక్క తేలుతుందని, ఈ విషయమై కోర్టుకు వెళ్తే కులగణన చేయాల్సిందేనని తీర్పు ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ లో సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ సమావేశంలో కులగణన చేయాలని నిర్ణయించి రూ.150 కోట్లు కేటాయించారని ఆయన వెల్లడించారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఏకగ్రీవ ఆమోదం పొందాక ఫైల్‌ను గవర్నర్‌కు పంపారని చెప్పారు.

## వారంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లాలో వారం రోజుల్లోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్ తెలిపారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాల్లోని వదలపర్తి, చినూర్, గోలి, లింగాల, తాండూర్, ఆత్మకూర్, మాచాపూర్ కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను, రాశులను పరిశీలించి, కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఏపీఎం రావునారాయణ గౌడ్, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, సీసీ దత్తు, నారాయణ, నజీర్, రమేష్ సిబ్బంది ఉన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో జుక్కల్ తోట లక్ష్మీకాంతారావు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి కుటుంబంలో పెళ్లి చేసిన ఆడబిడ్డలకు ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆదుకుంటోందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో అభినవ్ చందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్యామప్ప పటేల్, నాయకులు, మహేందర్ రెడ్డి, నాగిరెడ్డి, మోహన్, బన్సీలాల్, సర్పంచులు, బాలాజీ పటేల్, వినోద్, ఉప సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డులపై అపోహలు వద్దు




**అక్షరటుడే, కామారెడ్డి:** హెల్త్ కార్డుల విషయంలో ఉద్యోగులకు ఎలాంటి అపోహలు వద్దని, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మి ఆందోళనకు గురి కావద్దని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అటానమస్ బాడీని ఏర్పాటు చేస్తోందని, దీనిపై ప్రభుత్వ అజమాయిషీ ఉండదని తెలిపారు. ఈ ట్రస్ట్ కోసం ఉద్యోగుల వేతనాల్లోంచి 1.5 శాతం కోత విధించారని, ముందస్తు సమాచారం లేకుండా వేతనం కట్ కావడంతో ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. హెల్త్ కార్డ్ స్కీమ్ అమల్లోకి వస్తే కోత విధించినా ఎలాంటి ఇబ్బంది లేదని, విధివిధానాలు లేకపోవడం, ట్రస్ట్ ఏర్పాటు కాకముందే 1.5 శాతం కట్ కావడంతో గందరగోళం ఏర్పడిందని వివరించారు. ఇటీవల సీఎస్ రామకృష్ణారావుతో జరిగిన సమావేశంలో ట్రస్ట్ ఏర్పాటుకు 23 రోజుల్లో ఉత్తర్వులు ఇస్తామని చెప్పారని వెల్లడించారు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఒక్కరి నుంచే 1.5 శాతం కట్ అవుతుందని, జూన్ 10 నుంచి హెల్త్ కార్డ్ స్కీము ద్వారా నగదు రహిత చికిత్స అమలులోకి వస్తుందని తెలిపారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అల్జాపూర్ కుషాల్, ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నర్సారెడ్డి, కమిటీ సభ్యుడు గోవర్ధన్, హన్మాండ్లు, రాజు, స్వప్న, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ ఆఫీసులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగుర వేశారు. తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం చేసిన ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది త్యాగాలతో తెలంగాణ ఏర్పడిందన్నారు. –అక్షరటుడే, నెట్‌వర్క్


నిజామాబాద్ కలెక్టరేట్‌లో..


నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో..


నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీలో..



టీఎన్జీవో జిల్లా కార్యాలయ ఆవరణలో..


కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..


లింగంపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో..



కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద బీఆర్ఎస్..


నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



పెద్ద కొడప్‌గల్ మండలంలో..


పోచంపాడ్ గ్రామంలో..


మెండోరా తహశీల్దార్ కార్యాలయంలో..


ముప్కాల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..


ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలో..


ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..


మెండోరా పోలీస్ స్టేషన్‌లో..


ఎల్లారెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో..


డిచ్‌పల్లిలో..


కామారెడ్డి బీజేపీ కార్యాలయంలో..


ఆర్మూర్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..


ఆలూర్ మండల కేంద్రంలో..


కామారెడ్డిలో కిష్టయ్య విగ్రహానికి నివాళులు..

## ఉచిత కంటి వైద్య శిబిరం




**అక్షరటుడే, బాల్కొండ :** బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి డాక్టర్ పుణ్యరాజు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మోతిబిందు సమస్య ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, సీఐ జాన్ రెడ్డి, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కోశాధికారి వంశీ రెడ్డి పాల్గొన్నారు.

## పైపుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం..

**అక్షరటుడే, కామారెడ్డి :** ప్లాస్టిక్ పైపుల ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులోని హరిహర పాలిమర్స్ ఫ్యాక్టరీలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జంగంపల్లి గ్రామం నుంచి దోమకొండ వెళ్లే దారిలో హరిహర పాలిమర్స్ స్క్రాప్ ఫ్యాక్టరీ ఉంది. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. వేసవికాలం కావడంతో ఎండ తాకిడికి మంటలు దట్టంగా వ్యాపించాయి. దాంతో ఫ్యాక్టరీలో ఉన్న సామగ్రి కాలి బూడిదైంది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

## వడదెబ్బతో మహిళ మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. ఎండల తీవ్రతకు బయట తిరగవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయినా వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన ఆకుల లక్ష్మి(56) మంగళవారం వడ దెబ్బతో మృతి చెందింది. గ్రామంలో ప్రతిరోజూ కూలి పనికి వెళ్లే లక్ష్మి మంగళవారం కూడా వెళ్లింది. అయితే ఎండ తాపానికి తట్టుకోలేకపోయింది. వడదెబ్బ తగలడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

## తెల్లారితే పెళ్లి.. ఇరువర్గాల గొడవ..



**అక్షరటుడే, గాంధారి:** తెల్లారితే పెళ్లి.. పెళ్లికి ముందు లంబడి సాంప్రదాయబద్ధంగా చేపట్టిన 'టీకా' కార్యక్రమం చిలికి చిలికి గాలి వానగా మారింది. ఈ గొడక కాస్త తలలు పగలగొట్టుకునే వరకు వెళ్లింది. వివరాల్లోకి వెళ్తే.. చద్మల్ తండాలో జగదీష్, బేల్ సింగ్‌లకు ఇంటి స్థలం గురించి తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇదివరకే తహశీల్దార్ ముందు వీరిని బైండోవర్ చేశారు. అయితే బేల్ సింగ్‌కు పెద్ద కుమారుడి వివాహం కుదిరింది. దీంతో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం సాంప్రదాయ 'టీకా' కార్యక్రమం నిర్వహించారు. వేడుకలు జరుగుతుండగా బేల్‌సింగ్ ఇంటి జగదీష్ వచ్చాడు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య మరొకసారి గొడవ జరిగింది. దీంతో కర్రలతో కొట్టుకున్నారు. ఇందులో బేల్‌సింగ్ చిన్న కుమారుడితో పాటు జగదీష్ వర్గంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలవడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చద్మల్ తండాలో జరిగిన దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేశాం. వీరి మధ్య గొడవలు ఉండడంతో ఇదివరకే వీరిని తహశీల్దార్ ముందు బైండోవర్ చేశాం.

## రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలి




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఇంటర్న్‌లు రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని, ఆస్పత్రి నిబంధనలు, విధులు, వైద్య నైతికతను తప్పనిసరిగా పాటించాలని నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మోహన్ సూచించారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతన ఇంటర్న్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్య పూర్తి చేసి ప్రజాసేవలో అడుగుపెడుతున్న ఈ దశలో బాధ్యత, క్రమశిక్షణ, వైద్య నైతిక విలువలు పాటించాలని సూచించారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నాగ మోహన్ మాట్లాడుతూ ఇంటర్న్‌లు రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీకాంత్, డా. రవికిరణ్, డా. రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాళ్లు డా. కె.జె.కిషోర్ కుమార్, డా. జె.తిరుపతి రావు, డా. విజయ్ కుమార్, డా. అరుణ రేఖ, డా. సలీం, డా. రమణ, డా. ఇమ్రాన్, డా. శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆడిటోరియం పునరుద్ధరణకు చర్యలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** జుక్కల్ మండల కేంద్రంలోని ఆడిటోరియంను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మంగళవారం పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఆ భవనాన్ని ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆడిటోరియంను తీర్చిద్దుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. త్వరలో అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఉపాధి హామీ కార్మికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ పథకం ప్రారంభమై 20 సంవత్సరాలు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఉపాధి హామీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. పేద ప్రజల సంక్షేమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.